సీఎంఆర్‌ఈసీ అధ్యాపకురాలు ప్రశాంతికి డాక్టరేట్



మేడ్చల్‌రూరల్: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకురాలు ప్రశాంతికి జేఎన్‌టీయూహెచ్ డాక్టరేట్ ప్రదానం చేసింది. జేఎన్‌టీయూహెచ్ సీఎస్‌ఈ విభాగం ప్రొఫెసర్ చంద్రమోహన్ పర్యవేక్షణలో ×ఇన్నోవేటివ్ టెక్నిక్స్ ఫర్ ఎఫెక్టివ్ ప్రిడెక్షన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ డీఫిట్స్׳ అనే అంశంపై పరిశోధనకు సీఎంఆర్‌ఈసీ అధ్యాపకురాలు ప్రశాంతికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, కార్యదర్శి శ్రీశైలం రెడ్డి, ప్రిన్సిపాల్ ఏఎస్‌రెడ్డి, అధ్యాపకులు ఆమెను సన్మానించి అభినందించారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



విద్యార్థిని శివచందనను సన్మానిస్తున్న మాజీ సర్పంచులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మునీరాబాద్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి టాపర్‌గా నిలిచిన విద్యార్థిని సందగళ్ల శివచందనను గురువారం గ్రామ మాజీ సర్పంచులు చిట్టిమిల్ల గణేష్, రాగజ్యోతి, మాజీ ఉపసర్పంచ్ నర్సింగ్‌రావు, మాజీ వార్డు సభ్యులు నరేందర్ సన్మానించారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారని, మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

బోడుప్పల్: 18వ డివిజన్ పరిధిలోని ఈస్ట్ హనుమాన్‌నగర్, ఉదయ్‌నగర్ కాలనీల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ కాలనీవాసులు గురువారం ఏఈ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. పులకండ్ల జంగారెడ్డి, తిరునగరి ప్రమోద్‌కుమార్, రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి ఆహ్వానం

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ జేఎల్‌ఎన్‌ఎస్ నగర్‌లో నల్లపోచమ్మ, మహంకాళి, ఎల్లమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం నేటి నుంచి 4వ తేదీ వరకు నిర్వహించబడుతుందని నిర్వాహకులు ప్రకటించారు. ఈ మహోత్సవానికి దేవాలయ కమిటీ సభ్యులు గురువారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి ఆహ్వానం అందజేశారు.

బోడుప్పల్‌లో 'ఎర్లీబర్డ్' రూ.8.50 కోట్లు !

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థకు ఎర్లీబర్డ్ ద్వారా ఏప్రిల్ ఒక్క నెలలోనే రూ.8.50 కోట్లు ఆస్తిపన్ను రూపంలో వచ్చినట్లు కమిషనర్ శైలజ వెల్లడించారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. 2025–26 ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను రూ. 30 కోట్లు ఉండగా.. 5శాతం రాయితీతో రూ.8.50 కోట్లు వచ్చినట్లు తెలిపారు. మొత్తం ఆస్తిపన్ను మొత్తంలో 29 శాతం వసూలైనట్లు వివరించారు. ఈనెల 7 వరకు ఎర్లీబర్డ్‌ను రాష్ట్ర ప్రభుత్వం పొడిగించదని, ఈ అవకాశాన్ని ఇంటి యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

స్థానిక సమస్యలపై వినతి

కుషాయిగూడ: స్థానిక సమస్యలపై కుషాయిగూడ వెల్ఫేర్ అసియేషన్ ప్రతినిధులు కార్పొరేటర్ బొంతు శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారని, సంబంధిత అధికారులతో మాట్లాడి దశలవారీగా అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారన్నారు. చక్రపాణిగౌడ్, యాదయ్య, కిషోర్‌గౌడ్, వెంకటేష్, బాల్‌నర్సింహ్మా, నర్సింగరావు, శ్రీధర్, భాస్కర్, రాజు, క్రాంతి, మణికిరణ్, శ్రీనివాస్, దినేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణపై పోరుబాట !



మాట్లాడుతున్న బొజ్జ రమేష్

మల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ కార్మికుల హక్కులను భంగం కలిగించేలా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ.. పోరుబాట సాగించాలని దళిత జన సమితి కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ రమేష్ పిలుపునిచ్చారు. నాచారంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. దళిత జన సమితి కార్మిక విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నాగారంలో జెండా ఆవిష్కరణలో మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి



శామీర్‌పేట మండలం, అలియాబాద్‌లో..



అన్నోజిగూడలో మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి



ఉద్దమర్రిలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో..

ఘనంగా కార్మిక దినోత్సవం

మేడే ఉత్సవాలు నిర్వహించుకున్న కార్మికులు

మేడ్చల్ జోన్ పరిధిలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం కార్మికులు జెండా ఆవిష్కరణ చేసి కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్మికులందరూ కలిసికట్టుగా ఉంటూ తమ సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు, తమ డిమాండ్లను సాధించుకునేందుకు ముందుకెళ్లాలని, కార్మిక నేతలు సూచించారు.
– మేడ్చల్ జోన్ బృందం.



ఐఎన్‌టీయూసీ నేతృత్వంలో మేడ్చల్ ఆటో స్టాండ్ వద్ద..



అప్పుదిగూడ ఆర్జీకే కాలనీలో సీపీఐ కార్యదర్శి శంకర్



జీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మేడ్చల్ పారిశ్రామిక వాడలో..



సీఐటీయూ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ..



ఘట్‌కేసర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు



జవహర్‌నగర్‌లో మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, శివబాబు

క్వారీ గుంత చుట్టూ రక్షణ కంచె !

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ మల్కారం క్వారీ గుంతలో గత రెండు నెలల్లోనే సరదా కోసం వచ్చిన నలుగురు యువకులు మృతి చెందిన విషయం తెలిసిందే. జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ సైదయ్య పర్యవేక్షణలో గురువారం క్వారీ గుంత చుట్టూ ఫెన్సింగ్ వేసి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ.. సరదా, ఫోటోషూట్ కోసం ఈ క్వారీ గుంతకు వచ్చి మృత్యువాత పడ్డారని, ఈ క్వారీ గుంత వద్దకు యువకులు రావొద్దని, అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జవహర్‌నగర్ పోలీసులు, పలువురు యువకులు పాల్గొన్నారు.



మల్కారం క్వారీ గుంత వద్ద కంచె వేస్తున్న పోలీసులు

సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం



జవహర్‌నగర్: సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం లాంటిదని జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు చెందిన జంగిరి రవికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును గురువారం బాధితులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమమే సీఎం రేవంత్‌రెడ్డి అభిమతమని, వారి అభ్యున్నతికి ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. భాస్కర్, యాదగిరి యాదవ్, బుజ్జి, వినీత్, రాజుయాదవ్, అజిత్ తదితరులున్నారు.

వివాదాస్పదంగా అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు..

బీఆర్‌ఎస్ కార్పొరేటర్ భర్తపై కేసు నమోదు

అల్వాల్: అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు విషయంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్ భర్తపై అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటాపురం డివిజన్‌లోని కానాజీగూడ చౌరస్తాలో గతనెల 13న అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమయంలో పోలీసులు విగ్రహ ఏర్పాటుకు అనుమతి లేదని చెప్పడంతో స్థానికులు కార్పొరేటర్ భర్త అనిల్‌కిషోర్‌గౌడ్‌లు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. అనంతరం అల్వాల్ సర్కిల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డి పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా విగ్రహాల ఏర్పాటు చేయకూడదని, దీని వల్ల ప్రజలకు అసౌకర్యం ఏర్పడుతుందని విగ్రహ ఏర్పాటుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గురువారం బీఆర్‌ఎస్ కార్పొరేటర్ అనిల్‌కిషోర్‌గౌడ్ సహా కొంతమందిని స్టేషన్‌కు పిలిపించారు. దీంతో స్థానిక దళిత సంఘాల నేతలు, బీఆర్‌ఎస్ నాయకులు, పెద్దఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. విషయం ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డికి తెలియడంతో ఆయన కూడా పోలీస్‌స్టేషన్‌కి వచ్చారు. 'రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు విషయంలో కావాలనే కొందరు రాజకీయం చేస్తున్నారని' విమర్శించారు. 'అధికారులు వత్తాసు పలుకుతూ కేసు నమోదు చేయడం' సరికాదన్నారు. అనంతరం అనిల్‌కిషోర్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చి పంపించి వేశారు. ఈ విషయంపై దళిత సంఘాలు శుక్రవారం ఆందోళన చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.



అల్వాల్ పోలీస్‌స్టేషన్ వద్ద కార్పొరేటర్ సబిత, అనిల్‌కిషోర్ తదితరులు

అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆరా

యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశం

ఉప్పల్: వర్షాకాలం రాక ముందే వరద నీటి కాలువల అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ. కర్నన్ ఆదేశించారు. కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న వెంటనే ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని పలు సర్కిళ్లలో అధికారులతో కలిసి పర్యటించారు. దీనిలో భాగంగా నాగోల్ నుంచి ఆర్టీఓ కార్యాలయం వరకు చేపడుతున్న స్ట్రామ్ వాటర్‌డ్రైన్ నిర్మాణ పనులను పూర్తిచేయాలని సూచించారు. దీనివల్ల లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా ఉంటాయని, రోడ్లపై భారీ ఎత్తున వరద నీరు నిలిచే అవకాశం ఉండదని, ఆ దిశగా పనులను వేగవంతం చేయాలని సూచించారు.

- ఉప్పల్ నుంచి నారాపల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్ పనుల జాప్యంపై కమిషనర్ ఆరా తీశారు. ఉప్పల్ చౌరస్తా వద్ద ఫ్లై ఓవర్ పనుల జాప్యంపై అధికారులను ఆరా తీశారు.
- ఉప్పల్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి భూసేకరణ పనుల జాప్యంపై పనులు నిలిచిపోయినట్లు అధికారులు కమిషనర్‌కు వివరించారు. భూసేకరణ పనులను సైతం వేగవంతం చేయాలని సూచించారు. ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్ పాటిల్, ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులు, ఈఈ హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కుషాయిగూడ: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈసీఐఎల్ చౌరస్తా సమీపంలోని వుడ్‌ల్యాండ్ హోటల్ వద్ద సుమారు 60 ఏళ్లున్న వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. వారు పరీక్షించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712662194, 9966940056, 8712662119.

బ్యాంగిల్ స్టోర్‌లో చోరీ

పోచారం: బ్యాంగిల్ స్టోర్‌లో నగదు చోరీ చేసిన ఘటన పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడలోని లక్ష్మీనారాయణ కాలనీకి చెందిన మాచర్ల నాగేశ్వరరావు ఇంట్లోనే బ్యాంగిల్స్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఇంటికి తాళం వేసి బంధువుల దగ్గరకు వెళ్లారు. గురువారం తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు పగలగొట్టి రూ. 50 వేల నగదు చోరీ జరిగింది. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. కేసు దర్యాప్తులో ఉంది.

శ్రామిక శక్తి అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న సురేష్

బోడుప్పల్: సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలోని ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు చామకూర సురేష్‌కు శ్రామికశక్తి అవార్డు వచ్చింది. మేడే సందర్భంగా గురువారం గాంధీభవన్‌లో మాజీ ఎంపీ హనుమంత్‌రావు చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలో తాను చేస్తున్న సేవలకు ఈ అవార్డు వచ్చిందని, అవార్డుతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.

కులగణన కసరత్తు హర్షణీయం

పోచారం: దేశంలో కులగణన చేపట్టాలని కేంద్ర రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకోవడంపై మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేష్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్పకాలనీలో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, నరేంద్రమోదీ చిత్రపటాలకు ఆయన పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చేయించిన కులగణనతో మేలు జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం భావించడం అభినందనీయమన్నారు. రాజ్యాధికారంలో అన్ని వర్గాల ప్రజలకు చోటు దక్కాలంటే జనగణనతో పాటు కులగణన జరగాలన్నారు. 'మేమెంతో.. మాకంత'.. అంటూ నాయకులు నినాదాలు చేశారు. బీసీ సంఘం నాయకులు వెంకటేష్, రాజేందర్, అర్జున్, రమేష్, జాఫర్ హుస్సేన్, లక్ష్మి, వనజ, స్వాతి, కవిత, స్వప్న, శ్రీధర్, అలీ, యోగేష్, కృష్ణనాయక్ తదితరులున్నారు.



పాలాభిషేకం చేస్తున్న మాజీ కౌన్సిలర్ వెంకటేష్‌గౌడ్

విశ్వాసమే విజయానికి మూలం

రామంతాపూర్ : అటానమస్ అరోరా పీజీ కళాశాలలో నిర్వహిస్తున్న అన్వేషణ కల్చరల్ ఫెస్ట్ గురువారం ముగింపు వేడుకలకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఎక్స్‌పర్ట్ హెడ్ జాక్విలిన్ సౌమ్య నటరాజన్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకుని దీంతో మనలో పెరిగే ఆత్మవిశ్వాసంతో విజయానికి మూలమవుతుందన్నారు. సినీనటుడు గౌతమ్‌కృష్ణ మాట్లాడుతూ.. ఓటమితో కృంగిపోకుండా దాని నుంచి పాటాలు నేర్చుకుని జీవితంలో ముందుకు సాగిపోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.మాధవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్‌కుమార్, దేవేందర్‌రావు, ఎంబీఏ ఎంసీఏ విభాగాధిపతులు డాక్టర్ మధుబాల, డాక్టర్ శిరీషా తదితరులున్నారు.



ఫెస్ట్‌లో పాల్గొన్న ముఖ్యఅతిథులు

ఇంట్లో బంగారు గొలుసు చోరీ

పోచారం: గదిలో ఉంచిన బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగర్‌కర్నూల్‌కు చెందిన మహేశ్వరి కొర్రెముల్‌లోని సిద్ధార్థ కాలేజ్‌లో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతూ.. సమీపంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. గురువారం సాయంత్రం బంగారు గొలుసు తీసి గదిలో పెట్టింది. కొద్దిసేపటి తర్వాత గొలుసు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మినీ స్టేడియానికి మోక్షమెప్పుడో !

- అందుబాటులోకి రాని మేడ్చల్ మినీ స్టేడియం
- స్టేడియం ఆవరణలో ట్యాంకు నిర్మాణం

మేడ్చల్: చాలా ఏళ్లుగా శంకుస్థాపనకు నోచుకోకుండా గత ప్రభుత్వం చివరి సమయంలో ప్రారంభించిన మేడ్చల్ మినీ స్టేడియం ఇంతవరకు క్రీడాకారులు, యువకులకు ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు.

25 ఏళ్లక్రితం మొదలై...

మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద పారిశ్రామిక వాడలో నాటి ఎమ్మెల్యే దేవేందర్‌గౌడ్ రెవెన్యూశాఖ మంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన చేశారు ఆంధ్రప్రదేశ్ నుంచి రాష్ట్రం తెలంగాణగా మారినా స్టేడియం రాత మాత్రం మారలేదు. ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని 2022 జూన్ 15న ప్రారంభమైంది. ఇప్పటికీ పూర్తికాలేదంటే కోర్టు సమస్యలు, భూ వివాదాలు ఉన్నాయనుకుంటే అది స్టేడియంలో కాలేసి నట్లే. కేవలం నిధుల కొరత, ప్రజా ప్రతినిధుల అశ్రద్ధ కారణంగానే పనులు నత్తనడకన సాగుతూ.. 25 ఏళ్లకు పూర్తయింది.

పట్టణ ప్రగతిలో ప్రారంభం..

బీఆర్‌ఎస్ హయాంలో నిర్వహించిన పట్టణ ప్రగతిలో జూన్ 15న నాటి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. పట్టణ ప్రగతిలో భాగంగా స్టేడియానికి హడావుడిగా మరమ్మతులు చేసి గ్రౌండ్‌ను చదును చేసి రంగులు వేసి తెలంగాణ క్రీడా ప్రాంగణంగా మార్చి ప్రారంభించారు. అనంతరం సరైన వసతులు కల్పించకపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. హడావుడిగా ప్రారంభించిన స్టేడియాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



స్టేడియం ఆవరణలో నిర్మాణంలో తాగునీటి ట్యాంకు



మేడ్చల్ మినీ స్టేడియం

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

అసంపూర్తిపనులతో స్టేడియం ఆవరణ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. అధికంగా కార్మికులు ఉండే ప్రాంతంలో మినీస్టేడియం ఉండటంతో మందుబాబులు, ఇతరులకు అడ్డాగా మారిపోయింది.

కుచించుకుపోతున్న స్టేడియం ఆవరణ..

పనులు నిర్మాణ దశలో ఉండి, సౌకర్యాల లేమి కారణంగా స్టేడియం ఆవరణలోనే తాగునీటి ట్యాంకును నిర్మించారు. తాగునీటి కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరైన ట్యాంకు స్టేడియం ఆవరణలో నిర్మిస్తున్నారు. దీంతో స్టేడియం ఆవరణ కొంత మేర తగ్గనుంది.

కాంట్రాక్టర్‌కు సైతం కార్యాలయంగా..

క్రీడాకారులకు ఉపయోగపడనప్పటికీ స్టేడియం ఆవరణలో ట్యాంకు నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌కు మాత్రం ఉపయోగపడుతుంది. కాంట్రాక్టర్ స్టేడియం గ్యాలరీ వెనుకభాగంలో గదులు నిర్మించి సామగ్రి పెట్టేందుకు గోదామ్‌లు ఏర్పాటు చేసుకున్నాడు. క్రీడాకారుల కోసం నిర్మించిన భవనాన్ని కార్యాలయం, లేబర్ రూమ్‌లుగా మార్చుకున్నారనే ఆరోపణలున్నాయి. ఆవరణ మొత్తం నిర్మాణ సామగ్రి మొత్తం నింపేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.